మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

8 లో..

తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

ఇదండీ..కబురు..




సంపుటి : 22 సంచిక : 294 | మంగళవారం అక్టోబర్ 01 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల -5

## దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి

- » శ్రీవారి లడ్డూలో కల్తీ జరిగిందని ఎలా గుర్తించారు
- » లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆధారాలు ఉన్నాయా
- » వివరాలు తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటిస్తారు
- » ప్రస్తుత పరిస్తితుల్లో సిట్ దర్యాప్తుపై అనుమానాలు
- » సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు




**కబురు న్యూస్,న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30**

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వివాదంపై సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవు పలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ కేవీ వి బాలకృష్ణన్ ధర్మాసనం ప్రశ్నించింది. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని సుప్రీంకోర్ట్ నిలదీసింది. ఈ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిన అనంతరం కల్తీ నెయ్యిపై మీడియా ముందు ప్రకటన చేయడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటువంటి ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అన్న సందేహాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది.




# డిజిటల్ కార్డులపై 3నుంచి క్షేత్రస్థాయి పరిశీలన

### అధికారులతో మరోమారు సిఎం రేవంత్ సమీక్ష

**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 30**

కుటుంబ డిజిటల్ కార్డుల పంపిణీ సమయంలో కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గుర్తించిన కుటుంబాన్ని నిర్ధరించాలన్నారు. కుటుంబ డిజిటల్ కార్డులపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. డిజిటల్ కార్డుల కోసం సేకరించే వివరాలను అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.అక్టోబరు 3 నుంచి 7 వరకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలు, 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. కొత్త సభ్యులకు జత చేసి, చనిపోయిన వారిని తొలగించాలి. పైలెట్ ప్రాజెక్టులో ఎదురైన వివరాలతో నివేదిక తయారు చేయాలి. కుటుంబ సభ్యుల వివరాల మార్పులు చేర్పుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేక, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ఢిల్లీకి వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీకి బయల్దేరారు. ఇటీవల జమ్ముకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం ఆయన పరామర్శించనున్నారు. ఆ తర్వాత దిల్లీలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన తదితర అంశాలపై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకోవడం వెనక ఉన్న కారణాలను ఆయన అధిష్ఠానానికి వివరించే అవకాశముంది.

## కాళేశ్వరం అవినీతిపై దేశమంతా తెలుసు

- » తప్పులు కప్పిపుచ్చుకునేందుకే బిఆర్ఎస్ ఆరోపణలు
- » మండిపడ్డ మంత్రి సీతక్క



**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 30**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో భారాస చేసిన అవినీతి దేశమంతా తెలుసని మంత్రి సీతక్క పేర్కొన్నారు. భారాస పాలనలో జరిగిన తప్పిదాలను కనుమరుగు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో మూసీ పరివాహకంలో ఎన్నో అక్రమ కట్టడాలు వెలిశాయన్నారు. కొందరు చెరువుల మధ్యలో భవనాలను నిర్మించారన్నారు. మూసీ పరివాహకంలో ఎక్కువగా నేతల భవనాలే ఉన్నాయని, వాటిని పేదలకు అదెకు ఇచ్చారని విమర్శించారు. మూసీలో ఆక్రమణలతో అందరికీ ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. సామాన్యులకు నష్టం కలగకుండా చూస్తామన్నారు. ఇళ్లు కోల్పోతున్న పేదలకు స్థిర నివాసం కల్పిస్తామన్నారు. మిడ్ మానేరు, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల విషయంలో నిర్వాసితులను భారాస ఎంత నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయించారో అందరికీ తెలుసని, ఇప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు.

## కేసీఆర్ పదేళ్లపాటు రైతులను మోసం చేశారు

### ఇప్పుడు అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం

### బిజెపి రైతు దీక్షలో ఎంపి రఘునందన్ రావు



**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 30**

కేసీఆర్ పదేళ్ల పాటు చాలా హామిలు ఇచ్చి రైతులను మోసం చేశారని.. దీంతో ఎందరో అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. చనిపోయిన రైతు కుటుంబాలను కనీసం పరామర్శించని బీఆర్ఎస్ నేతలు ఇవ్వాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఏనాడు భూసార పరీక్షలు చేయలేదని చెప్పారు. నాడు బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ అదే విధానాన్ని అవలంభిస్తున్నాయని ధ్వజమెత్తారు.

## కాంగ్రెస్ రైతులను నమ్మించి మోసం చేసింది

### హామీలు ఇచ్చి గద్దెనెక్కాక వాటిని మరచి పోయారు

### ఇందిరాపార్క్ వద్ద దీక్షలో ఎంపి అర్వింద్ విమర్శలు



**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 30**

కాంగ్రెస్ రైతులను నమ్మించి మోసం చేసిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కాక ఇప్పుడు వాటిని మరచి పోయారని అన్నారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి బీజేఎల్పీ నేత అయినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన ఎన్నో స్కాములు, అవినీతిని బట్టబయలు చేశారని అన్నారు. కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో సీట్లు రాలేదు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలకు గ్రామీణ ప్రాంతాల్లో ఓట్లు వచ్చాయని చెప్పారు.

# మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్

- » లక్షన్నర కోట్లు పెట్టి ఏం సాధిస్తారు
- » ఇళ్లు ఇస్తామని..ఇప్పుడు కూలుస్తారా
- » మూసీలో పట్టాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ
- » నమామి గంగే ప్రాజెక్టుకే 40వేల కోట్లు
- » సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్




**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 30**

మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. లక్షన్నర కోట్లు కర్చు పెట్టి ఎవరిని ఉద్ధరిస్తారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంని ప్రశ్నిస్తున్నా. మేం మొత్తం దేశంలో ఉండే అన్ని ప్రాజెక్టుల వివరాలు తెప్పించాం. నామామి గంగే డీపీఆర్, ప్రాజెక్ట్ వివరాలు.. ప్రాజెక్టు పూర్వపరాలు తెప్పించాం. నమామి గంగే ప్రాజెక్టుపై ఆసక్తితో వివరాలు తెప్పించాను. 2400 కిలోమీటర్ల గంగానది ప్రక్షాళన కోసం కేంద్రం ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసింది. ఈ ప్రాజెక్టుకు పెట్టిన బడ్జెట్ రూ. 40వేలకోట్లు. 2400 కిలోమీటర్ల గంగా నదికి రూ. 40వేలుకోట్లు. 50 కిలోమీటర్ల మూసీ సుందరీకరణ కోసం ఈ ముఖ్యమంత్రి రూ. 1.50లక్షలకోట్ల ఖర్చు అవుతుందని సీఎం చెబుతున్నారు. దీన్ని స్కామ్ అనక ఏమనాలి. దీనివెనుక ఉన్న మతలబు ఏంటీ? చెప్పాలి

02

### దసరాకు ప్రత్యేక బస్సులు అందుబాటులో 6వేల సర్వీసులు




**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 30**

దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 6,000 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది.

02

## క్షమాపణ చెప్పండి లేదంటే పరువునష్టం దావాకు సిద్ధంకండి:



**తనపై** తప్పుడు ఆరోపణలు, బురద జల్లే ప్రయత్నాలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై ఆరోపణలు చేసినవారు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే పరువు నష్టం దావా వేస్తానని సోమవారం(సెప్టెంబర్30) ఎక్స్(ట్విటర్)లో చేసిన ఒక పోస్టులో హెచ్చరించారు.

## మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

### మూసీలో మార్కింగ్ కూడా మేం చేపట్టడం లేదు

02



**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 30**

: మూసీ సుందరీకరణపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టడం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టని చెప్పారు.

# సంపాదకీయం

## నింద భోజనం

కొన్ని నైతిక బోధలు అన్నిచోట్లా కనబడతాయి. అబద్ధము ఆడరాదు. జీవహింస చేయరాదు... ఇలా! కానీ, వారణాసిలోని కబీర్ జన్మస్థలైన కబీర్ మఠ్‌కు వెళ్లినప్పుడు అక్కడ కనిపించే మొదటి నైతిక బోధ 'నిందలు వేయరాదు' అని! కబీర్ దాస్ తన ప్రబోధాలలో ఎక్కువగా అప్రమత్తం చేసింది నిందలు వేసే వారి గురించే!! 'వేయిమంది పాపులను కలిసినా ఫరవాలేదు నిందలు వేసే ఒక్కణ్ణి తప్ప. నిందలు వేసే వాని శిరము వేయి పాపాల పుట్ట' అన్నాడాయన.సిసలైన వేటగాడు ఉత్త చేతులతో ఇంటికొచ్చి నింద అడవి మీద వేయడు. ఆహార సేకరణ కాలంలో అనునిత్యం చెమటోడ్చి, రక్తం చిందించి ఆహారం సేకరించుకోవాల్సి వచ్చినప్పుడు ప్రతి బలహీన పురుషుడు నోటికి నేర్చిన మాట నింద. వేటే దొరకలేదు... నది పొంగింది... తేనెటీగలు తరుముకున్నాయి... బాణం దిగినా సరే పారిపోయింది.తర్వాతి కాలంలో సకల చేతగానితనాలకీ, అగణిత అప్రయోకత్వాలకీ చవటలు వెతుక్కునే అన్ని నిందలకూ కనిపెట్టుకున్న అడ్రస్ ఒకటి ఉంది. దాని పేరు ఖర్మ. నింద ఖర్మ మీద వేస్తే ఆ తర్వాత మన దేశంలో వేరే ఏమీ చేయనక్కర్లేదు. 'ఏం చేస్తామండీ ఖర్మ' అని తడవకోసారి అంటూ ఉంటే చాలు. సాఫల్య కర్మల కోసం కాదా కర్మ?అప్రయోజకత్వం అక్కసుకు సింహద్వారం. వైఫల్యం అహంకారానికి గొడ్డుకారం.కళ్లెదుట కష్టపడి పని చేసేవాడు, భార్యాపిల్లలను చక్కగా చూసుకునేవాడు, డబ్బు జాగ్రత్త చేసుకునేవాడు, తెలివిగా మసలుకునేవాడు, వ్యసనాలకు దూరంగా ఉండేవాడు, వచ్చిన విద్యను అంటిపెట్టుకుని ఉండేవాడు, తెగించి కొత్తదారులు కనిపెట్టేవాడు... వీళ్లంతా ముందుకు వెళుతుంటే విజేతలై అధిగమిస్తుంటే ఇవన్నీ చేయలేని, చేయరాని, చేసేందుకు కనీసం ప్రయత్నించి చూడని ప్రతి గాడిదకూ చేతికి అందే మారణాయుధం నింద. గెలిచినవాడిని ఓడించేందుకు ధర్మబద్ధమైన ఏ ఆయుధమూ లేని పరాజితుడు అంతిమంగా ప్రయోగించే పాశుపతాస్త్రం నింద. ఇది టీకా లేని క్రిమి. నాల్కల ద్వారా వ్యాపించే మహమ్మారి.పాఠశాల విద్య తద్వారా తెలుగు భాష ముందుకు సాగడానికి చిన్నయ సూరి ఆవిష్కృతం చేసిన అతి ముఖ్యమైన కృషి 'బాల వ్యాకరణం' వేలాదిగా అమ్ముడుపోవడం మొదలుపెట్టాక ఆయన మీద పడ్డ నింద – అది కాపీ రచన అని... అది వేరెవరో పండితుడు రాశాడు అని. చిన్నయ సూరి ఈ గండం నుంచి గట్టెక్కడానికి గురు సమానులైనవారి వైపు ఆశగా చూస్తే వారూ చేసిన పని 'అవును.. కాపీయే' అని నిందించడం. ఐదారేళ్లు చిన్నయ సూరి నిందను మోశాక నింద ఓడిపోయింది. చిన్నయ సూరి మిగిలాడు.  ఒక వేశ్య రచన చేయుటయా... ఆస్థానాలలో ఆడే దేవదాసి కవిత్వం చెప్పుటయా అని నాటి పెద్దలకు ముద్దు పళని మీద ఆగ్రహం వచ్చింది. 'లోపల ఏముందో తర్వాత.. ముందు అశ్లీలం అని నింద వేయండి' అన్నారు. ఆ నిందను జయించి తెలుగు సారస్వతంలో తన స్థానం దక్కించుకోవడానికి 'రాధికా సాంత్వనం' ఎంత సాంత్వనం కోల్పోయిందని? తప్పులు, పొరపాట్లు చేయడం మానవ సహజం. పురాణాలూ ఈ సందర్భాలను ఎత్తి చూపాయి. రాముణ్ణి మాయలేడి వెంట పంపి సీత తప్పు చేసింది. ఆ తప్పు వల్ల ఆమెలో ఆందోళన జనించింది. ఆ ఆందోళన ఇంగితం కోల్పోయేలా చేసింది. ఎంతకూ రాని రాముని గురించి పరితపిస్తూ, రక్షణకు వెళ్లమని, 'నా మీద కన్నేసి నువ్వు కదలడం లేదు కదూ' అని లక్ష్మణుడి మీద నింద వేసే సరికి అతడు హతాశుడయ్యాడు.తర్వాతి కాలంలో ఈ సీతమ్మే ఘోర నిందను ఎదుర్కొంది. అగ్నిపునీతగా నిలిస్తే తప్ప నింద వదల్లేదు. సకల లీలా మాధవుండైన శ్రీకృష్ణుడు కూడా నిందచేసే లీలకు చకితుడయ్యి జాంబవంతుడితో యుద్ధానికి దిగాడు శమంతకమణి కోసం! ఆ మాటకొస్తే ఆడిన మాట తప్పాడన్న నింద వస్తుందన్న భయం లేకపోతే హరిశ్చంద్రుడు పడేవాడా అన్ని కష్టాలు? దేనికీ జడవనివాణ్ణి జడిసేలా చేయగలదు నింద.నిందలు ఎందుకు వేస్తారు అంటే అది చాలా సులభమైన పని కనుక అంటారు మనస్తత్వ శాస్త్రవేత్తలు. గుచ్చుకుంటున్న స్వీయ వైఫల్యాలకు కాసింత మలాము రాసుకోవడానికి ఎదుటివారికి మలం పూస్తారు ఇట్టివారు. అక్కసును, ద్వేషాన్నీ గెలుపుగా మార్చుకునేందుకు దేశాలపై, జాతులపై, మతాలపై, కులాలపై, వ్యక్తులపై, సార్థకులపై నిందలు వేస్తారు. నిందకు దండన అనుమతి ఉంది. చేతబడి చేస్తున్నారన్న నింద వేశాక ఊరంతా కలిసి వారిని చంపుతుంటారు.నింద బలిగోరుతుంది. విడిపోయి తమ దారి తాము చూసుకుందామనుకునే తోబుట్టువులు ఇవాళ సుపారీ ఇస్తున్నది నిందకే. నిందలు వేసేవారు పదేపదే నెగెటివ్ ఆలోచనల్లో చిక్కుకుని ఏమీ సాధించలేక చరిత్రహీనులుగా మిగులుతారనడానికి ఆధారాలున్నాయి. నేటి సోషల్ మీడియా అంతా నిందలు వేసే మందబుద్ధు లతో ఎంతగా నిండి ఉందంటే రోజూ వేల కొలది పోస్టుల పాపపుకూడు ఉడికి వడ్డనవుతున్నది. ఈ భోజనానికి ఎగబడుతున్న అమాయకులు ఎందరో. కవులు, రచయితలు ఎప్పుడైనా ఈ దారి తొక్కుతున్నారా ప్రయివేటు సంభాషణలను నిందలతో నింపుతున్నారా, చెక్ చేసుకోవాలి. మొదట నింద వేసినవారు సచ్ఛీలురు అయిపోవడం నింద సమకూర్చే అతి పెద్ద లాభం. అంత మాత్రం చేత నింద వేసిన వారు గెలిచినట్టు కాదు. మోసినవారు ఓడినట్టు కాదు. సదుద్దేశంతో సద్విమర్శ చేసేవారిని ఇంటిలో నాటే చెట్టంత దగ్గరగా ఉంచుకోమన్నాడు కబీర్ దాస్. సమాజం సద్విమర్శతో నిర్మితమవుతుంది. నిందతో కాదు. నింద నిందపడి పాడుగానూ!

## క్షమాపణ చెప్పండి లేదంటే పరువునష్టం దావాకు సిద్ధంకండి:

మొదటిపేజీ తరువాయి
'ప్రజా సమస్యలపై పోరాడుతున్న నా పై బురద చల్లె వికృత రాజకీయాలకి తెరలేపినట్లు ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు.ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత ను డైవర్ట్ చేయడానికి గోబెల్స్ ప్రచారాల్ని ఆశ్రయిస్తున్నట్లున్నారు.గోల్కొండ కోట, చార్మినార్‌లో కూడా హరీశ్‌రావుకు వాటాలు ఉన్నాయి అని అంటారేమో?అబ్బద్దపు ప్రచారాలు చేస్తున్నందుకు గాను లీగల్ నోటీస్ పంపుతున్నా.బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి'అని హరీశ్‌రావు ట్వీట్‌లో పేర్కొన్నారు.కాగా, ఆనంద కన్వెన్షన్ సెంటర్‌లో హరీశ్‌రావుకు వాటాలున్నాయని, దానిని కూల్చకుండా అడ్డుకోవడానికే పేద ప్రజలను అడ్డం పెట్టుకుని వారిని రెచ్చగొడుతున్నారని రాజ్యసభ ఎంపీ అనిల్‌యాదవ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి కౌంటర్‌గా హరీశ్‌రావు పరువునష్టం దావా పోస్టు పెట్టారు.

## దసరాకు ప్రత్యేక బస్సులు అందుబాటులో 6 వేల సర్వీసులు

మొదటిపేజీ తరువాయి
ఈ ప్రత్యేక బస్సులు ప్రస్తుత ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు, వివిధ ప్రాంతాలకు మరింత సౌకర్యంగా ప్రయాణం చేసేందుకు సర్వసాధారణ మైన మార్గాల్లో నడుపుతారు. ప్రయాణికులు ఆన్‌లైన్ లేదా బస్సు స్టేషన్‌ల ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. ఈ ప్రత్యేక సేవలు దసరా సమయంలో అనేక మందికి ప్రయోజనకరంగా ఉంటాయి, తద్వారా వారు ఈ పండుగను సుఖంగా జరుపుకోగలుగుతారు. అయితే.. హైదరాబాద్ శివారు నుంచి దసరాకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఓఆర్‌ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరుకు సర్వీసులు అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉండనున్నట్లు సజ్జనార్ వెల్లడించారు. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని సజ్జనార్ పేర్కొన్నారు.

# దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి

మొదటిపేజీ తరువాయి
స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసిందంటూ సుప్రీంకోర్ట్ సందేహం వ్యక్తం చేసింది. అలాగే స్వామి వారి ప్రసాదం లడ్డూని పరీక్షల కోసం ల్యాబ్‌కి ఎప్పుడు పంపారని ముకుల్ రోహత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బావుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం ఈ కేసు విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ బాలకృష్ణన్ ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తిరుమల లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తిరుమల స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి నట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ అంశంలో నిజం నిగ్గూ తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిపింది. తత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర అపచారం జరిగిన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో శాంతి హోమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. అలాగే సంప్రోక్షణ కార్యక్రమాన్ని సైతం చేపట్టింది. అందులోభాగంగా ఆనంద నిలయంతో పాటు తిరుమల మాఢవీధుల్లో సైతం సంప్రోక్షణ నిర్వహించింది. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు ఐజీ సర్వ శ్రేష్ఠి త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో శనివారం సిట్ బృందం తిరుమల చేరుకుని.. తన దర్యాప్తును ప్రారంభించింది.

# కాంగ్రెస్ రైతులను నమ్మించి మోసం చేసింది

మొదటిపేజీ తరువాయి
సోమవారం ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష జరిగింది. ఈ దీక్షలో ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అందుకే ఇక్కడ పేదల ఇళ్లను కూలుస్తు న్నారని విమర్శించారు. తొమ్మిదేళ్లు తెలంగాణలో ప్రజా కంటగింపు పాలనను చూశామన్నారు. కేసీఆర్ ఇక అధికారంలోకి రాడని.. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను కూలుస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలను ఒకలా.. హిందువులను మరోలా చూస్తున్నారని ధ్వజమెత్తారు. హిందువుల ఇళ్లను మాత్రమే హైడ్రా కూలుస్తుందని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వంలో రైతు రుణమాఫీలేదు.. రైతు భరోసా లేదు.. బోనస్ ముచ్చటే లేదని మండిపడ్డారు. ప్రమాదవశాత్తు పంట నష్టం జరిగితే ఆదుకునే నాథుడే లేరని ఎంపీ అరవింద్ అన్నారు. కేసీఆర్.. ఒక ఎకరాకు కోటి సంపాదిస్తున్నాడట.. కోటి సంపాదన ఎలా సాధ్యమో తెలుసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఒక టీమ్‌ను ఆయన ఫాంహౌస్‌కు కూడా పంపాలని కోరారు. పరిశీలించడానికి రేవంత్ టీంను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు గైడ్ చేయాలని సూచించారు. కేసీఆర్ దిగిపోయాక ఆయన మాటలను చాలా మిస్ అవుతున్నానని అన్నారు. ఉద్యమ సమయంలో ఆయన పులిలా ఉన్నారు.. ఇప్పుడు పిల్లి లాగా అయ్యారని ఎంపీ అరవింద్ విమర్శలు చేశారు. కేసీఆర్.. తెలంగాణను నట్టేటా ముంచారని ఎంపీ అరవింద్ ఫైర్ అయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో పోతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు అగ్రికల్చర్ పాలసీ ఎందుకు తీసుకురాలేదని ఎంపీ అరవింద్ ప్రశ్నించారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు అల్లం, పసుపుకు తేడా తెలియదని.. ఆయన కూడా ఈరోజు మాట్లాడుతున్నారని ఎంపీ అరవింద్ ఎద్దేవా చేశారు. కేసీఆర్‌లాగే వరి మాత్రమే వేసుకునే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. రేవంత్ ప్రభుత్వంలో రైతు భరోసా కాదు.. బీమా కూడా అందట్లేదని ఎంపీ అరవింద్ ఆరోపించారు. మాజీ ప్రధాని ఇందిరమ్మను కూడా ప్రశాంతంగా ఉండనివ్వకుండా ఇంకా బదనాం చేస్తున్నారని అన్నారు. ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ స్కూళ్లను ప్రారంభిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇదే పరిస్థితి ఉంటే.. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌కు పడుతుందని చెప్పారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని కోరారు. కేసీఆర్‌ను ఆయన ఫ్యామిలీని చూసి ఇప్పటి పరిస్థితుల్లో ఎవరూ ఓటు వేయరని అన్నారు. బీజేపీ నేతలు అంతా ఇలాగే కలిసి కట్టుగా బలమైన అపొజిషన్‌గా వెళ్తే వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారం మనదేనని ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు.

# మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి
దానిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని ఆందోళనలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. నదీ పరివాహక ప్రాంతంలో నివాసితుల భద్రత, పునరావాసం, కూల్చివేతలకు సంబంధించిన వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో, కమిషనర్ కొన్ని ముఖ్యమైన వివరాలను వెల్లడించారు. మూసీ నదికి ఇరువైపులా జరుగుతున్న సర్వేలు హైడ్రాకు సంబంధించినవి కాదని స్పష్టంగా అవగాహన చేయాలని కోరారు. ఈ సర్వేలు హైడ్రా చట్టం లేదా ప్రాజెక్టుకు సంబంధించినవి కాదని తెలిపారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను హైడ్రా తరలించడం లేదని ఆయన స్పష్టం చేశారు. నివాసితులపై జరుగుతున్న ఇబ్బందులు తప్పనిసరిగా నివారించబడాలని హైడ్రా సంస్థ భావిస్తోందన్నారు.మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని ఆయన తెలిపారు. ఇది నివాసితుల కష్టాలను, అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చేయబడిన నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్నదని, ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాన్ని అందంగా మార్చడం, పర్యావరణ సురక్షణపై దృష్టి సారించడం ద్వారా స్థానిక ప్రజలకు ప్రయోజనాలు అందించడం లక్ష్యంగా ఉందన్నారు. ఈ ప్రకటనలు, వాస్తవాలను స్పష్టం చేసేందుకు, ప్రజల భద్రతా ఆశలపై హైడ్రా సంస్థ కట్టుబడినట్టు తెలియజేయడానికి ఒక ప్రయత్నమన్నారు. ప్రజలు భద్రత కోసం కృషి చేయాలని, వాటిని మరింత నిశ్చితంగా, సహాయకరంగా చూడాలని కమిషనర్ కోరారు. ప్రజల, హైడ్రా సంస్థ మధ్య అనుబంధాన్ని మెరుగుపరచడం, స్థానిక అభివృద్ధికి దోహదం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని.. ఆయన సూచించారు.

# మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్

మొదటిపేజీ తరువాయి
కదా. అనుమతులు ఇచ్చిన ఇండ్లను కూల్చడమంటే ప్రభుత్వానికి తన వ్యవస్థ మీద, తన యంత్రాంగం, పరిపాలనపై తనకే పట్టులేనితనానికి నిదర్శనం కాదా? అని అడుగుతున్నానన్నారు. మున్సిపల్ మంత్రిగా నేను ఎనిమిదేళ్లు పని చేశాను. కూల్చాల్సి వస్తే.. మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్‌ను. కమిషనర్ ఎక్కడ కుసున్నడో.. బుద్ధ భవన్ నాలామీదున్న ఉన్నది. దాంట్లోనే ఎలక్షన్ కమిషనర్ ఉన్నడు. హైడ్రా కమిషనర్ ఉన్నరు. అందులో ఉమెన్స్ కమిషన్ ఉన్నది. మొదట ఆ భవనం కూల్చాలి. రెండోది ఏ జీహెచ్‌ఎంసీ పర్మిషన్‌లు ఇస్తదో.. ఆ జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని కూల్చాలి. జీహెచ్‌ఎంసీ ఆఫీస్ కూడా నాలాపైనే ఉన్నది. మరి ఇతరులకు సుద్దులు చెప్పే ముందు ఇక్కడి నుంచే మొదలిపెట్టాలి. నాకు తెలిసి సీఎంకి అవకాశం ఇస్తే.. కొత్తగా కట్టుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం కూలుస్తడు. ఆయనో లక్ష్యం పెట్టుకున్నడు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా పెట్టుకున్నడు. సెక్రటేరియట్ చూడంగనే అందరికీ కేసీఆర్ గుర్తుకు వస్తడు. మొన్న గణపతి బొప్ప మోరియా అనుకుంటా వెళ్లారు. అక్కడికి రాంగనే కేసీఆర్ గుర్తుకు వచ్చిండు.. కేసీఆర్ పాటలు పెట్టంగనే ముఖ్యమంత్రికి ఇరిటేషన్ వస్తున్నది. మూసీ బాధితుల ఆక్రందనలు చేస్తున్నా.. ఇబ్బంది పడుతుంటే.. నిన్న మొన్నటి వరకు డైలాగ్‌లు కొట్టిన మీ అధినాయకులు ఎక్కడా? మీ రాహుల్ గాంధీ యేడీ? మీ ప్రియాంక గాంధీ ఎక్కడ? అని ప్రశ్నించారు. కాళేశ్వరం అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. ఒక పంటకు 40లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టు. పరిశ్రమలకు 10శాతం నీళ్లు వస్తాయి. హైదరాబాద్ మహానగరంతో పాటు వేలాది గ్రామాలకు తాగునీరు ఇచ్చే ప్రాజెక్టు. హైదరాబాద్ నెత్తిమీద శాశ్వతంగా ఒక కుండపెట్టినట్టే కరువు తీర్చే కల్పతురువు కాళేశ్వరం. కాళేశ్వరం కట్టం తర్వాత వరిసాగులో భారతదేశంలో తెలంగాణ టాప్. ఇది కాళేశ్వరం పుణ్యం కాదా? రూ.లక్షకోట్ల పెట్టుబడితో ఏం జరిగిందంటే.. తెలంగాణ వరిసాగులో టాప్‌గా నిలిచింది' అన్నారు. కాళేశ్వరంతో తాగునీటి సమస్య పోయింది. హైదరాబాద్‌కు తాగునీటి సమస్య రానే రాదు. ఇప్పటికే మూసీ కింద ఉన్న ఆయకట్టు కాకుండా కొత్తగా ఏమన్న వస్తుందా? మూసీ ప్రాజెక్టులో రిజర్వాయర్ ఉన్నదా? పంప్ హౌస్ ఉన్నదా? అండర్‌గ్రౌండ్ టన్నెల్ ఉన్నదా? ఏం లేకున్నా రూ. 1.50లక్షలకోట్లంటే స్కామ్ కాదా? అని తెలిపారు.థేమ్స్ నదికి కూడా ఖర్చుపెట్టింది దాదాపు రూ.40వేలకోట్లు. వీటన్నింటికంటే అద్భుతాన్ని ఆవిష్కరిస్తా నంటే.. రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత? రాష్ట్ర ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఎంత? ఎవరి కోసం మూసీ ప్రాజెక్టు చేపడుతున్నవ్ చెప్పాలి. ఇంత వరకు రైతుబంధు దిక్కులేదు. కొత్త హామీలు కాదు.. ఇచ్చిన హామీలు ఏమాయ్యాయంటూ.. పెన్షన్లు ఎగ్గొట్టావంటే చెప్పేటోడు లేడు' కేటీఆర్ మండిపడ్డారు.వంద రోజుల్లో చేస్తామన్న పనులను 300 రోజులు దాటినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. వంద రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని పత్రికల్లో ప్రకటనలు సైతం ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదన్నారు. మూసీ పరివాహక ప్రజల పట్ల సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తోన్న తీరు సరైంది కాదు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఇళ్లకు పట్టాలు వచ్చాయని పలువురు ప్రజలు చెప్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు చెప్తున్నారని పేదలు అడుగుతున్నారు. గతంలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. చెరువులకు హద్దులు ఎందుకు గుర్తించలేదన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని అన్నారు. ఇళ్లు కట్టిస్తామన్నారు కానీ.. కూల్చుతామని ఎన్నికల ముందు చెప్పారా? సాగరహారం లాంటి ఉద్యమాలు మళ్లీ రావాల్సిన అవసరం ఉంది. ప్రజలు తిరగబడితే మంత్రులు ఊళ్లల్లో కూడా తిరగలేరు. పేద ప్రజల ఇళ్లను ఇలా కూల్చేస్తూ ఉంటే మేం చూస్తూ ఊరుకోం. ఇకపై బుల్డోజర్లకు భారాస నేతలు అడ్డుగా ఉంటారని కేటీఆర్ హెచ్చరించారు.

# కేసీఆర్ పదేళ్లపాటు రైతులను మోసం చేశారు

మొదటిపేజీ తరువాయి
సోమవారంఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష జరిగింది. ఈ దీక్షలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... రైతు సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పంట నష్టపోతే ఆదుకునేందుకు ఫసల్ బీమాను కేంద్రం తీసుకువస్తే.. కేసీఆర్ ఎందుకు తెలంగాణలో అమలు చేయనివ్వ లేదని ప్రశ్నించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎంత అపఖ్యాతి మూటగట్టుకుందో.. 10 నెలల్లో కాంగ్రెస్ అంత మూట గట్టుకుందని విమర్శించారు. కేసీఆర్.. ఫామ్ హౌస్‌ను జాతికి అంకితం చేస్తావా? ఏం చేస్తావో తెలియదని అన్నారు. రైతులకు న్యాయం చేయాలని అన్నారు. కేసీఆర్ అవినీతి లక్ష కోట్లను సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి కక్కిస్తామని హెచ్చరించారు. నాడు పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్.. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారని.. కానీ ఇప్పుడు సిట్టింగ్ జడ్జి దొరకలేదా? రిటైర్ అయిన జడ్జితో సిట్ వేశారని ఎద్దేవా చేశారు. రేవంత్ మూసీ సుందరీకరణ పేరిట కొత్త డ్రామా మొదలు పెట్టారని విమర్శించారు. తెలంగాణలో రైతుల సమస్యలు తీర్చడం బీజేపీకే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ ఒక 420 అనే విషయం అందరికీ తెలుసునని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శలు చేశారు.

## ప్రజావాణి వినతులను స్వీకరించిన జిల్లా కలెక్టర్...



**కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 30**

ప్రజల నుండి అందిన అర్జీలను పరిశీలించి సాధ్యా సాధ్యాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజల వచ్చిన అర్జీదారుల నుండి వారి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు సత్వర పరిష్కారానికి అందజేశారు. భూ సంబంధ, వ్యక్తిగత, తదితర సమస్యలపై పలు అర్జీలను తీసుకొని ఆయా సంబంధిత అధికారులకు అందజేశారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఆన్ లైన్ లో పొందుపరిచి వాటి పరిష్కారం, అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రజావాణిలో 74 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ అధికారులు, వివిధ విభాగాల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు

## యాజమాన్యం మార్పుపై ఆందోళన వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు



**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 30**

బాన్సువాడ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియకుండా యాజమాన్యం మార్పు చెందినందుకు నిరసనగా సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో ఒక సంస్కృతి చెందిన కార్యక్రమాలను విద్యార్థులతో చేయించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని, యాజమాన్యం మార్పు చేసేటప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఎందుకు ఇవ్వలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు.సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు విద్యార్థుల తల్లిదండ్రులను సముదాయించి పంపించి వేశారు.

## భారతీయ రత్న అవార్డు అందుకున్న దినేష్ పాటిల్...




**కబురు న్యూస్, బోధన్ సెప్టెంబర్ 30..**

బోధన్ పట్టణానికి చెందిన న్యాయవాది దినేష్ పాటిల్ భారతీయ రత్న అవార్డు అందుకున్నారు. మహారాష్ట్రలోని పూణే లో గ్లోబల్ ఫౌండేషన్, బెల్గేవే ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం భారతీయ రత్న 2024 అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన్ వాసి, జిల్లా ఇన్చార్జి పీపీ, న్యాయవాది జి.శ్యామ్ రావు కుమారుడు తెలంగాణ ఉన్నత న్యాయస్థానం న్యాయవాది జి. దినేష్ పాటిల్ కు భారతీయ రత్న అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సామాజిక, సాంఘిక, న్యాయ సేవలకు గుర్తింపుగా భారత దేశ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉదయ్ దేశపాండే ఈ అవార్డును అందించడం జరిగిందని అవార్డు గ్రహీత దినేష్ పాటిల్ హర్షం వ్యక్తం చేస్తూ తెలిపారు.

# కార్మికులు బాగుంటేనే సమాజం బాగుపడుతుంది...

# ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంత్ రావు







### - స్వచ్ఛత హి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే తోట

**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 30**

ఆరోగ్యవంతమైన సమాజం కోసం అనునిత్యం కృషి చేస్తున్న కార్మికుల కుటుంబాలు బాగుంటేనే సమాజం బాగుంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు అన్నారు. సోమవారం మద్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛత ఈ పక్షోత్సవాల్లో భాగంగా మల్టీపర్పస్ కార్మికులకు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంత్ రావు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత కొరకు పారిశుద్ధ కార్మికులు నిత్యం మురికి కాల్వలను శుభ్రం చేస్తూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న వారి సేవలను గుర్తించి వారిని సత్కరించుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. పంచాయతీ కార్మికులకు ఐడి కార్డు పంపిణీ చేసి, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పారిశుద్ధ కార్మికులతో కలిసి అధికారులు సహా పంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ నాగరాజు, ఎంపీడీవో రాణి, తహసిల్దార్ ముజీబ్, ఎంపీఓ వెంకట నరసయ్య,సొసైటీ చైర్మన్ శ్రీను పటేల్,పార్టీ అధ్యక్షుడు సాయిలు, నాయకులు కొండ గంగాధర్,రమేష్,హ్యాన్మాండ్లు, విఠల్,ప్రజ్ఞ కుమార్, మండల ఆరోగ్య అధికారి నాగార్జున, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం,గంజాయి రవాణా,కల్తీ కల్లుపై ఉక్కుపాదం







### - మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి.
### - మోర్తాడ్,భీంగల్,ఆర్మూర్ ఎక్సైజ్ స్టేషన్ల నూతన భవనాలకు ప్రారంభోత్సవాలు....

**కబురు న్యూస్,నిజామాబాద్,సెప్టెంబర్ 30 :**

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్, భీమ్గల్, ఆర్మూర్ లలో నూతనంగా నిర్మించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ భవనాలను జిల్లా ఇంచార్జి మంత్రి అయిన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక,పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీతో కలిసి లాంఛనంగా ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,ఎక్సైజ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రి జూపల్లికి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయా ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గడిచిన ఐదేళ్ల వ్యవధిలో ఎన్ని కేసులు నమోదయ్యాయి,ఎంతమందికి శిక్షలు ఖరారయ్యాయి.స్థానికంగా గంజాయి సాగు జరుగుతోందా,మాదకద్రవ్యాల రవాణా తదితర



అంశాల గురించి ఎక్సైజ్ అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణ వ్యాప్తంగా ప్రతి పల్లెలో గంజాయి,ఆల్ఫ్రాజోలం,గుడుంబా వంటి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల ఆనవాళ్లు లేకుండా ఉక్కుపాదం మోపాలని మంత్రి ఆదేశించారు.గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.అక్రమ మద్యం,గంజాయి రవాణా,మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటి తనిఖీ కోసం హైదరాబాద్ నుండి ప్రత్యేక బృందాలను పంపిస్తామని మంత్రి వెల్లడించారు.ప్రత్యేక బృందాల తనిఖీల్లో ఎక్కడైన గంజాయి,మాదకద్రవ్యాలు,మత్తు పదార్థాలు పట్టుబడితే,సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.అక్రమ మద్యం,గంజాయి నియంత్రణే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.దేశంలో ఎక్కడ లేని విధంగా గత ప్రభుత్వ హయాంలో ప్రజలు మద్యానికి బానిసై వేలాది కుటుంబాలు ఆగమైనాయని మంత్రి జూపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. అనధికార మద్యం షాపులను ప్రోత్సహించారని, వేలాదిగా బెల్టు షాపులు వెలిశాయని ఆక్షేపించారు.సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో తమ ప్రభుత్వం అక్రమ మద్యం,గంజాయి,కల్తీ కల్లు నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.బాల్కొండ నియోజకవర్గంలో పకడ్బందీగా అక్రమ మద్యం,గంజాయి రవాణాను అరికట్టారని ఎక్సైజ్ అధికారుల పనితీరును మంత్రి అభినందించారు.మంత్రి వెంట నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్,ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి,సూపరింటెండెంట్ మల్లారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, ముత్యాల సునీల్ రెడ్డి,వినయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్

### - జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన....




**కబురు న్యూస్,నిజామాబాదు లీగల్,సెప్టెంబర్ 30 :**

రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ,ఫెడరేషన్ అఫ్ బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం రోజు నిజామాబాద్ బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశమై న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు.అనంతరం జిల్లా కోర్టు ప్రధాన ద్వారం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేశారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ,రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని ప్రభుత్వం తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని రాష్ట్రంలో టెన్యూర్ పిపి నియామకం విడానని కొనసాగించాలని 41(ఎ) సిఆర్పిసి,35 బిఎన్ఎస్ఎస్,సిఆర్పిసి అమెండ్మెంట్ చేయాలని వెంటనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్ రెడ్డి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు న్యాయవాదులు డాన్పల్ సురేష్ పిల్లిశ్రీకాంత్ ఏర్రం గణపతి వి భాస్కర్ శ్రీధర్ విశ్వక్ సేన్ఆశ నారాయణ భిక్షపతి శివాజీ భోస్లే సాయన్న జైపాల్ మహిళా న్యాయవాదుల కవితారెడ్డి అంజలి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి...



**కబురు న్యూస్, బోధన్ సెప్టెంబర్ 30..**
కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని నిజాం చక్కర కర్మాగార కార్మికులు కోరారు. సోమవారం పట్టణంలోని శక్కర్ నగర్ లో గల నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట కార్మిక సంఘం నాయకులు,కార్మికులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కుమారస్వామి మాట్లాడుతూ నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ లే ఆఫ్ చేసిన సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య సమస్య వల్ల కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు పూర్తి విశ్వాసం ఉంది కాంగ్రెస్ ప్రభుత్వం చక్కర కర్మాగారం నడిపిస్తుందని కానీ అప్పటి వరకు కార్మికుల జీవనం గడవాలంటే బకాయి వేతనాలు ఇప్పించాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు రవిశంకర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీ ఓపెన్ చేసి ఆదుకుంటామని చెప్పిన విధంగా సాద్యాసాద్యాల పైన ఒక కమిటీ వేసి కార్మికులకు తీపి కబురు అందించారు. సీఎం రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 17న భూమి పూజ చేస్తామన్నారు. కానీ ఇప్పటివరకు చేపట్టలేదు. బతుకమ్మ, దసరా, దీపావళి పండగలు వస్తున్నందున కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని వాపోయారు. కార్మికులకు రావలసిన వేతన బకాయిలలో నుండి కొంచెం డబ్బులు కార్మికులకు చెల్లించాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, బాలకృష్ణ, రాంబాబు బాస్కర్, రమేష్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్, సెప్టెంబర్ 30 :**



ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్,అంకిత్ తో పాటు డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా,అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విజయేందర్ రెడ్డి సేవలు ప్రశంసనీయం





**- వీడ్కోలు కార్యక్రమంలో అభినందించిన ఎమ్మెల్యే, కలెక్టర్....**

**కబురు న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 30 :**
నిజామాబాద్ జిల్లా రెవెన్యూ శాఖలో తహశీల్దార్ క్యాడర్ లో పదవీ విరమణ చేసిన కలెక్టరేట్ కార్యాలయ ఈ-సెక్షన్ పర్యవేక్షకుడు విజయేందర్ రెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయం అని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కొనియాడారు.విజయేందర్ రెడ్డి సోమవారం పదవీ విరమణ చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఘనంగా వీడ్కోలు పలికారు.పూలమాలలు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.రెవెన్యూ శాఖ ఉద్యోగిగా విధుల్లో చేరిన విజయేందర్ రెడ్డి ఎలాంటి రిమార్క్స్ లేకుండా సర్వీస్ ను పూర్తి చేసుకోవడం ఎంతో గొప్ప విషయమని కలెక్టర్ అభినందించారు. సీ.సీ గా సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించడంతో పాటు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా సమర్ధవంతంగా నిర్వర్తించారని అన్నారు.కాగా,విజయేందర్ రెడ్డి సేవలను భవిష్యత్తులో కూడా వినియోగించుకుంటామని ఎమ్మెల్యే అన్నారు.కలెక్టరేట్ లో సుదీర్ఘ కాలం పాటు వివిధ హోదాలలో ఆయన అందించిన సేవలను సహచర అధికారులు,సిబ్బంది సైతం కొనియాడుతూ,శేష జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.కాగా,తన ఉద్యోగ నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికి విజయేందర్ రెడ్డి



కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్,అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్,నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్,రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమన్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్,కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వరల్డ్ స్మిత్ అవార్డు అందుకున్న ఘంటే నగేష్...







**కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్ 30..**
బోధన్ నియోజకవర్గం సాలూర మండల కేంద్రానికి చెందిన ఘంటే నగేష్ వరల్డ్ స్మిత్, ఫోటో గ్రఫీ అవార్డులు అందుకున్నారు. ఆదివారం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో కవి ఏషియన్ లిటరరీ సొసైటీ 7వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలలో కవితల పోటీలలో విజేతలకు వరల్డ్ స్మిత్ అవార్డులు, బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా సాలూర మండల కేంద్రానికి చెందిన ఘంటే వీరప్ప కుమారుడు నగేష్ ది ప్రిన్సెస్ ఇన్ నేచర్ అనే కవిత తో పాటు ఫోటోగ్రఫీ పోటీ కోసం ఆకాశ మేఘాల నుండి తీయబడిన ఫోటోకు వరల్డ్ స్మిత్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఏసియన్ లిటరరీ సొసైటీ వ్యవస్థాపకులు మనోజ్ కృష్ణన్, రచయిత, మాజీ కార్యదర్శి డా.అమరేంద్ర ఖతువా, సూఫీ గాయని, ఢిల్లీ దర్బార్ సహ వ్యవస్థాపకురాలు మిస్ వుసత్ ఇక్బాల్ ఖాన్, డా.సుభాష్ చంద్ ల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు అవార్డు గ్రహీత నగేష్ సంతోషం వ్యక్తం చేస్తూ తెలిపారు.

# పేదలకు సంక్షేమ పథకాలు అందించలేని ప్రభుత్వం... మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్

**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 30**
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అమలు కానీ హామీలను ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత హామీలను విస్మరించిందని బిఆర్ఎస్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ అన్నారు. సోమవారం ఆయన కబురు ప్రతినిధితో మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి విడుదల వారీగా అని మాట దాటవేస్తూ రైతులను మోసం చేసిన ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్పాలన్నారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్ల పెంపు చేస్తామని చెప్పినా ఇప్పటికీ 9 నెలలు గడుస్తున్నా పెన్షన్లు పెంచకపోవడం వల్ల వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హైడ్రా పేరుతో పేద మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూలుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతుందని, ప్రజలకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలు మరోసారి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.



# బాన్సువాడలో సభ్యత్వ నమోదు చేపట్టిన టీఎన్జీవో నాయకులు




**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 30**
బాన్సువాడ టిఎన్జీవో సంఘ నాయకులు సోమవారం పలు ప్రభుత్వ కార్యాలయాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి ఉద్యోగులు అందరూ ఐకమత్యంగా ఉన్నట్లయితే సమస్య లను పరిష్కరించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సంఘ సభ్యులు తులా శ్రీనివాస్, వెంకటేష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పప్పుల రాజేంద్రప్రసాద్ ఎన్నిక



**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 30**

కామారెడ్డి జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ ఎన్నికలు ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా జిల్లా అధ్యక్షుడిగా పప్పుల రాజేంద్ర ప్రసాద్ సమీప ప్రత్యర్థి కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన గౌరీ శంకర్ పై 58 ఓట్లతో విజయం సాధించారు. కార్యదర్శిగా బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన కందకుర్తి సంతోష్ గుప్తా, కోశాధికారిగా ముత్యపు సుదర్శన్ గుప్తాలను అసోసియేషన్ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పప్పుల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనను ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, జిల్లాలో రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మిల్లర్ల సంక్షేమానికి పాటు పడతానన్నారు. రైస్ మిల్లర్ల సమస్యలను తనకు సమాచారం అందిస్తే సంబంధిత అధికారుల వద్దకు వెళ్లి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని, అందరికీ అందుబాటులో ఉండి రైస్ మిల్ అసోసియేషన్ ను సంఘ సభ్యులతో కలిసి ఐకమత్యంతో అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఈ సందర్భంగా రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులు నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి కోశాధికారులను ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన టిఎన్జీవోలు



**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 30**

బాన్సువాడ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం టీఎన్జీవో సంఘ సభ్యులు సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో కార్యవర్గ సభ్యులు నాగరాజు, కోశాధికారి దేవరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిలు, ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు మైపాల్, చరణ్, శ్రీనివాస్, తుల శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ వికాస్ ను సత్కరించిన దళిత ఐక్య వేదిక...



**కబురు న్యూస్, బోధన్ సెప్టెంబర్ 30..**

దళిత ఐక్య వేదిక నాయకులు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ను ఘనంగా సత్కరించారు. సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ ను దళిత ఐక్య వేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మందుగుల విద్యాసాగర్, గోసంగి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాజేష్, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, ఎస్సి,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యులు రామకృష్ణ, మాల మహానాడు అధ్యక్షులు రేకం దాస్, బాలరాజు, నాయకులు ఉప్పల రామకృష్ణ, నాగురావు, మహేందర్, నాంపల్లి రాజు తదితరులు ఉన్నారు.

## సన్ వే పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు





**కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 30**

బీర్కూర్ మండల కేంద్రంలోని సన్ వే ప్రైవేటు పాఠశాలలో సోమవారం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నాగ పరమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యత తెలియజేసేందుకు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ విద్యార్థులు ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శేఖర్ యాదవ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలు పెంపొందించే విధంగా కృషి చేయాలి.. జిల్లా కలెక్టర్



**కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 30**




జిల్లాలో నీటి సంరక్షణ, భూ గర్భ జలాలు పెంపొందించే పనులకు సంబంధించిన పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి సంరక్షణ, భూ గర్భ జలాలు పెంచే పనులు, ప్లాంటేషన్ లకు సంబంధించినవి, పూర్తి చేయబడిన, చేయవలసిన పనులను గుర్తించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. అక్టోబర్ 8 నుండి 10 వరకు జిల్లాలో జలశక్తి అభియాన్ కేంద్రం బృందం పర్యటించనున్న సందర్భంలో జిల్లాలోని నీటి సంరక్షణకు సంబంధించిన నివేదికలను సంబంధిత శాఖల నుండి సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పరిషత్ సీఈఓ చందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా భూగర్భ శాఖాధికారి సతీష్ , జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, మున్సిపల్ కమీషనర్ సుజాత, జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ దుర్గా ప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారిని జ్యోతి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే





**కబురు న్యూస్ పిట్లం సెప్టెంబర్ 30**

పిట్లం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాయకులు మొగుల గౌడ్, రమేష్ గౌడ్, సాయిలు,తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఓ ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధికారికి వినతి పత్రం అందజేత



**కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 30**

వ్యవసాయ విస్తీర్ణ అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా వ్యవసాయ అధికారికి కలెక్టర్ కార్యాలయంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారుల జేఏసీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ ట్రాఫిక్ బుకింగ్ కొత్త యాప్ ద్వారా, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఏఈఓ లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. డిజిటల్ క్రాఫ్ట్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించడానికి రిజిస్టర్ క్రాప్ సర్వే కొరకు అవసరమైన తాత్కాలిక సిబ్బందిని ఆంధ్రప్రదేశ్ ,మహారాష్ట్ర, కర్ణాటక,తమిళనాడు రాష్ట్రాలలో తీసుకున్న విధంగా వ్యవసాయ విస్తీర్ణ అధికారి గ్రామస్థాయిలో సహాయకులుగా నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నరాల వెంకటరెడ్డి, కేంద్ర కార్యదర్శి నాగరాజు, కోశాధికారి దేవరాజు, సంఘ సభ్యులు సాయిలు, శ్రావణ్ కుమార్ ,సంతోష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ జిల్లా జేఏసీ సభ్యులు శ్రావణ్ కుమార్, రాకేశ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, సురేష్, సంతోష్ కుమార్, మీనా, శ్రీ లక్ష్మీ,మౌనిక ,రజిత, మనుష్య కవిత,సౌజన్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి





**కబురు న్యూస్ నిజామాబాద్ సెప్టెంబర్ 30**

నిజామాబాద్ పట్టణంలోని ఎస్సీ ఎస్డిఎఫ్ నిధులతో నాలుగు కోట్ల 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించే నిజామాబాద్ నుండి వర్ని రోడ్డు, 6 కోట్లతో నిజామాబాద్ నుండి నర్సి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ లతో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి పాల్గొని రాష్ట్ర మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రాజీవ్ గాంధీ హన్మంతు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందన్, నగర మేయర్ నీతు కిరణ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత,నాయకులు, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# విద్య,వైద్య రంగాలకు ప్రాధాన్యత

- జిల్లా స్థాయి సమీక్షలో మంత్రి జూపల్లి....
- ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై దిశానిర్దేశం....
- పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ,ఎమ్మెల్యేలు....











**కబురు న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 30 :** విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పనితీరులో స్పష్టమైన మార్పు తెస్తామని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతిక,పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంత్రి జూపల్లి సోమవారం నిజామాబాద్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి,డాక్టర్ భూపతి రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రగతి గురించి మంత్రి దృష్టికి తెచ్చారు. వ్యవసాయం, విద్య, వైద్యం తదితర శాఖలపై సమీక్షలో సమగ్ర చర్చ జరిపారు.జిల్లాలో 71 వేల రైతు కుటుంబాలకు రూ. 626 కోట్ల రుణమాఫీ జరిగిందని కలెక్టర్ వివరించారు. పలు సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి రుణమాఫీ జరుగలేదని,ఈ విషయమై ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరిస్తూ నివేదికలు పంపామని అన్నారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి జూపల్లి అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ,ప్రజలకు పారదర్శకమైన పాలన అందేలా కృషి చేయాలని హితవు పలికారు. అర్హులైన రైతులందరికీ తప్పనిసరిగా రూ. 2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. పలు సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ జరుగనందున, అలాంటి రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే రాష్ట్ర స్థాయి అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యి సాంకేతిక ఇబ్బందులను అధిగమించి అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ ద్వారా లబ్ది చేకూరేలా చూడాలన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా స్పష్టతతో ఉన్నారని మంత్రి వెల్లడించారు. కాగా, జిల్లాలో ఈసారి అధిక విస్తీర్ణంలో వరి పంట సాగు చేస్తున్నందున అందుకు అనుగుణంగా ఎక్కువ సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కేంద్రాలను నెలకొల్పాలని, ప్రతి కేంద్రంలోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా అకాల వర్షాలు కురిస్తే ధాన్యం నిల్వలు తడిసిపోకుండా సరిపడా టార్పాలిన్లు సమకూర్చాలని సూచించారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, గత సీజన్లో జిల్లాలో 435 ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగగా, ఈసారి 505 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అవసరమైన పక్షంలో మరిన్ని కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తామని, ఈ మేరకు అన్ని విధాలుగా అధికారులను సన్నద్ధం చేశామని అన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా అవసరమైతే ఇతర శాఖల సిబ్బందికి సైతం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై శిక్షణ ఇచ్చి వారి సేవలు వినియోగించుకోవాలని మంత్రి జూపల్లి సూచించారు. ధాన్యాన్ని నిలువ చేసేందుకు వీలుగా అవసరమైన మేర గిడ్డంగులను గుర్తించాలన్నారు.విద్యాశాఖపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,ప్రతి ప్రభుత్వ పాఠశాల,కళాశాలలో వసతులను మెరుగుపర్చి నాణ్యమైన విద్యా బోధన జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తద్వారా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశాలను గణనీయంగా మెరుగుపడేలా ప్రతిఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు.తరగతి గదులు, శానిటేషన్,టాయిలెట్స్, నీటి వసతి, ఫ్యాన్లు,విద్యుత్ బల్బులు వంటి కనీస సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు.పాఠశాలలకు ఆంగ్ల,తెలుగు దినపత్రికలు అందేలా చర్యలు తీసుకోవాలని,డిక్షనరీని సమకూర్చాలని తద్వారా విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందేందుకు ఇవి దోహదపడతాయని మంత్రి జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు.మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు వీలుగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రైవేట్ విద్యా సంస్థలతో పోలిస్తే, ప్రభుత్వ బడులలో నిపుణులు,విషయం పరిజ్ఞానం కలిగిన అధ్యాపకులు ఉంటారని,పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించేలా అంకిత భావంతో బోధన విధులు నిర్వర్తించాలని హితవు పలికారు.సమర్ధవంతంగా విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు అవార్డులు అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ కు సూచించారు.కాగా,పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని డీఈఓను ఆదేశించారు. వైద్య రంగంలోనూ స్పష్టమైన మార్పు కనిపించాలని,ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు పట్ల ప్రజల్లో నమ్మకం పెంపొందేలా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నిధులలో కనీసం సగభాగం నిధులను విద్యా,వైద్య రంగాలకు వెచ్చించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు.డెంగ్యూ,విష జ్వరాలు,మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ,ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని,అధికారులు కూడా ప్రజలకు జవాబుదారిగా ఉంటూ సమర్ధవంతంగా సేవలు అందించాలని సూచించారు.ప్రభుత్వానికి వచ్చే ప్రతీ పైసా ప్రజల కష్టార్జితం అయినందున, నిధులు వృధా కాకూడదనే ఉద్దేశ్యంతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. గత పాలకులు లెక్కకు మిక్కిలి అప్పులు చేసిన ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు.ఇందులో భాగంగానే అర్హులైన వారందరికీ రైతు భరోసా అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కళాశాలగా అప్ గ్రేడ్ చేస్తాం

కాగా, నిజామాబాద్ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కళాశాలగా అప్ గ్రేడ్ చేస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు.అదేవిధంగా తెలంగాణ యూనివర్సిటీకి అనుబంధంగా ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన గురించి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ ను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో ఉద్యోగ శిక్షణార్థులకు భోజన వసతి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశానికి ముందు మంత్రి జూపల్లి నిజామాబాద్ నగరంలో రూ. 6 కోట్లతో నిజామాబాద్ నుంచి నర్సీ రోడ్ మరమ్మతులు, రూ. 4.50 కోట్లతో నిజామాబాద్ - వర్ని రోడ్ మరమ్మతు పనులకు శంకుస్థాపనలు చేశారు.ఆర్మూర్ నవనాథ్ సిద్ధులగుట్టను దర్శించుకుని,ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, మార్క్ ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చేనేత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి...

- సంఘం పర్సన్ ఇంచార్జ్ వెంకటరమణ..





**కబురు న్యూస్,శంకరపట్నం సెప్టెంబర్ 30** చేనేత కార్మికుల కుటుంబాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆముదాలపల్లి పారిశ్రామిక ఉత్పత్తి విక్రయ సంఘం పర్సనల్ ఇంచార్జ్ వెల్దండి రమణ ప్రభుత్వాలను కోరారు. సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట మండలం ఆముదాల పల్లి చేనేత, ఉత్పత్తి విక్రయ సంఘం 50 వ వార్షిక 62వ మహాసభ సంఘ కార్యాలయంలో సంఘ పర్సనల్ ఇంచార్జ్ వెల్దండి వెంకటరమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మహాసభను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి వ్యాపార రంగంలో నూతన డిజైన్లతో మార్కెట్ పోటీ పడుతుందని, మార్కెట్ డిమాండ్ అనుగుణంగా సంఘం ఆధ్వర్యంలో, ఆధునిక డిజైన్లు కొత్త రకాలు, ఉత్పత్తి నైపుణ్యం పొంది. మార్కెట్ డిమాండ్ అనుగుణంగా నూతన డిజైన్లు తయారు చేసి విక్రయాలు జరుపుటకు సులువు తరమవుతుందని ,ప్రభుత్వ పథకంలో పారిశ్రామికులకు ప్రతినెల నేతన్నలకు 8 శాతం రూపాయిలు మినహాయించి, బ్యాంకులో జమ చేయగా ప్రభుత్వం నుండి, అకౌంట్లో జమ చేయబడును కావున పారిశ్రామికులు అందరూ అధిక ఉత్పత్తిలో పాల్గొని అధిక సంఖ్యలో చేనేతకు చేయూత పథకంలో చేరవలసినదిగా కోరుచున్నాని ,చేనేత పారిశ్రామికులకు 50 సంవత్సరాలు పూర్తయిన కార్మికులకు చేనేత పెన్షన్ , బీమా పథకం ద్వారా సంఘం లోని సభ్యుడు మరణించిన ఎడల వారి నామినేకి ప్రభుత్వం ద్వారా 5 లక్షల రూపాయలు ఆర్థిక అందించడం జరుగుతున్నదని. గతంలో చేనేత మిత్ర పథకం ద్వారా సభ్యులకు నేరుగా లబ్ధి చేరే విధంగా నేత పారిశ్రమలకు పారిశ్రామి ఉత్పత్తి చేసిన నూలు విలువపై 30 శాతం సంఘమునకు 5 శాతం ప్రభుత్వం అందజేసిందని, కానీ ఇట్టి పథకం ప్రభుత్వం రద్దు చేసి ఉన్నారు. కానీ ఇట్టి పథకం వలన చేనేత కుటుంబాలు అధిక లాభం పొంది ఉన్నారు. కావున చేనేత మిత్ర పథకమును పునరుద్ధ వలచినదని , ఈ మాసభ ఏకంగా తీర్మానికి తీర్మానం చేసి, ప్రభుత్వాన్ని కోరనైనది. గతంలో ఆరోగ్య బీమా ఈ మహాసభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు . పథకంలో చేనేత కార్మికులకు అర్హులైన వారికి లక్ష రూపాయలు రుణమాఫీ ప్రకటించినందున ప్రభుత్వానికి మహాసభ ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు. చేనేత కుటుంబాలను ప్రభుత్వము వెన్నంటు ఉండి ఆదుకోవాలని రమణ కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార అభివృద్ధి అధికారి జౌళి శాఖ కరీంనగర్ అజార్ అవాజ్, సంఘ ఉపాధ్యాయులు సందుపట్ల జనార్ధన్, కార్యవర్గ సభ్యులు వి రామచంద్రం, శంకరయ్య ,మంతెన సరోజినీ, శ బడుగు సప్న, మంతెన సరోజన,సంఘం మేనేజర్ వెల్లండి వెంకటరాజ్యం , సిబ్బంది ఆడెపు కనకయ్య, చందుపట్ల, చిమ్మని సదానందం, శ్రీనివాస సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య జెండా ఆవిష్కరణ

**కబురు న్యూస్, దినపత్రిక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి.** తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ 1956౹1976 వరకు 20 సంవత్సరాలు తెలంగాణ ఎరుకల అమరవీరులు అల్పెరుగని ఉద్యమాలు పోరాట ఫలితమే ఆనాడు ఢిల్లీకి వెళ్లి వంటావార్పు చేసి మా ఎరుకల కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎనలేని పోరాటం చేశారు. ఆ పోరాట ఫలితమే ఈరోజు సెప్టెంబర్ 30న ఎస్ టీ జాబితలో చేర్చి నేటికి 48 సంవత్సరములు పూర్తైన సందర్భముగా మీర్‌పేట్ హౌసింగ్ బోర్డ్ 4 వ డివిజన్ కైలాసగిరిలో కూరాకుల మల్లికార్జున్ ఆధ్వర్యంలో పూర్వీకులను స్మరించుకుంటూ జండా ఆవిష్కరణ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ జండా కార్యక్రమానికి ముక్య అతిధులుగా తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అద్యక్షులు కుతాడి కుమార్ రాష్ట్ర ఉపాద్యక్షులు రాంపల్లి నరసింహ గారు ఉప్పల్ నియోజకవర్గం నాలుగో డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు నమేలి అనిల్ మరియు హౌసింగ్ బోర్డు ఎరుకల సంఘం నాయకులు రాములు నరసింహ భాస్కర్ నవీన్ చిన్న నరేష్ మధు సురేష్ కూరాకుల లక్ష్మి దుర్గావేణి మహేశ్వరి మాదేవి వర్షిణి ప్రవీణ్ ఈశ్వరి అనిల్ .మరియు వివిధ కాలనీ నాయకులు నవీన్ గౌడ్ యాకూబ్ నవీన్ అశోక్ బాలరాజు హరిప్రసాద్ కుమార్ మహేందర్ ఆకాష్ యెల్లం యాదగిరి ప్రకాష్ రాజు దేవేందర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితురాలి కుటుంబానికి 7,400 రూపాయల ఆర్థిక సహాయం..

- జడ్.పి.హెచ్.ఎస్ 2010-11 ఎస్ఎస్సి బ్యాచ్ వీణవంక

**కబురు న్యూస్, ప్రతినిధి,వీణవంక, సెప్టెంబర్ 30.** వీణవంక మండల కేంద్రానికి చెందిన గొట్టే భాగ్యమ్మ ఇటీవల కాలంలో అనారోగ్య కారణంతో చెందగా, మృతురాలి కుమార్తె స్వర్ణలత తో జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల 2010 -2011 పదోతరగతి చదువుకున్న బ్యాచ్ స్నేహితులు (బాయ్స్, గర్ల్స్ ) వారి కుటుంబ సభ్యులను పరమార్శించి, వారి కుటుంబానికి 7,400 రూపాయలనుఅందజేశారు.ఈ కార్యక్రమంలోదసారపు అశోక్, వంశీకృష్ణ, రాకేష్,ఏజ్జు శ్రీధర్, సాయికుమార్ చారి,సునీత టెన్త్ క్లాస్ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత చదువులతో అసమానతలు తొలగిపోతాయి...



**– యువత ఉన్నత చదువులు లక్ష్యంగా ముందుకు సాగాలి.... జతాసిల్దార్ భాస్కర్...**

కబురు న్యూస్,శంకరపట్నం సెప్టెంబర్ 30

ఉన్నత చదువులతో అసమానతలు తొలగి కులమత బేధాలు దూరం అవుతాయని ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు లక్ష్యంగా ముందుకు సాగాలని శంకరపట్నం తాసిల్దార్ బత్తుల భాస్కర్ యువతకు సూచించారు. సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని మెట్ పల్లి గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తాసిల్దార్ భాస్కర్ మాట్లాడుతూ గ్రామాల్లో కుల మత భేదలు అసమానతలు తొలగిపోవాలంటే ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులే లక్ష్యంగా ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలను సాధించి ఉన్నతంగా స్థిరపడాలన్నారు. కుల మత బేధాలు చూపిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వెల్లడించారు. తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు అంతడుపుల సతీష్ ఆధ్వర్యంలో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు గ్రామస్తులు కార్యక్రమంలో భోజనం చేసి కుల మత బేధాలు లేవని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరిండెంట్ రాఘవేందర్ రెడ్డి, ఎఎస్ఐ సుధాకర్, డాక్టర్ మనోచిత్ర, దళిత సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ కు ముస్తాబవుతున్న కేశవపట్నం జిల్లా పరిషత్ పాఠశాల...

కబురు న్యూస్,శంకరపట్నం సెప్టెంబర్ 30

క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ కోసం క్రీడా ప్రాగణం సిద్ధంగా తయారు చేస్తున్న నిర్వాహకులు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం ,కేశవపట్నం గ్రామానికి చెందిన గాజుల నందన్ అలియాస్ చోటు అనే యువకుడు అకాల మరణం చెందగా ఆయన స్మారకార్థం కేశవపట్నం జిల్లా పరిషత్ పాఠశాల లో అక్టోబర్ 2 న నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ కు క్రీడా ప్రాగానాన్ని సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




## ఎంఈఓ శోభారాణి ని సన్మానించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం..

**– విద్యార్థులకు షూ పంపిణీ చేసిన ఎంఈఓ శోభారాణి..**




కబురు న్యూస్,ప్రతినిధి, వీణవంక, సెప్టెంబర్ 30.

వీణవంక మండలం ఘనుక్ల గ్రామ పరిధిలో ఉన్న సోమవారం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వీణవంక మండల నూతన ఎంఈఓ శోభారాణి విచ్చేయగా, మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం పూల గుచ్చుములు అందజేస్తూ,శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంఈఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఆదర్శ పాఠశాలలు విద్యార్థులు నైపుణ్యం, విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తున్నారని, గ్రామస్థాయి నుండి ఢిల్లీ స్థాయికి వెళ్లిన ఘనత ఘన్ముక్ల మోడల్ స్కూల్ కి దక్కుతుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరడానికి ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని,ప్రభుత్వం అందించే పథకాలను ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని , తల్లిదండ్రుల ఆశయాలను, ఉపాధ్యాయుల కళలను నెరవేర్చే నిరంతర సారథులై విద్యార్థులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్,నాగిరెడ్డి,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 'యా' అనొద్దు.. ఇది కాఫీ షాపు కాదు లాయర్‌పై సీజేఐ ఆగ్రహం

కబురు న్యూస్, దినపత్రిక సంగారెడ్డి జిల్లా.



సుప్రీంకోర్టులో ఒక కేసు విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఓ న్యాయవాదిపై ఆగ్రహం వ్యక్తం చేశారు సదరు న్యాయవాది వాదనలు వినిపించే క్రమంలో పదేపదే 'యా' అంటుండటంపై సీజేఐ విస్మయం వ్యక్తం చేశారు. 'యా' అనేది గౌరవప్రదమైన పదం కాదని ఆ న్యాయవాదికి సీజేఐ సూచించారు. "మీరు కేఫ్‌లో లేరు.. కోర్టు రూంలో ఉన్నారు.. పదాలను జాగ్రత్తగా వాడండి.. యా అనే పదం అంటే నాకు, మా న్యాయమూర్తుల బెంచ్‌కు అలర్జీ. అలాంటి పదాలు వాడేందుకు మిమ్మల్ని మేం అనుమతించం" అని సీజేఐ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు.

# బెల్ట్ షాపులతో... మండలంలో ఏరులై పారుతున్న మద్యం..

**– మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు... మద్యం మత్తులో రోడ్డున పడుతున్న కుటుంబాలు..**
**– ధనార్జన ధ్యేయంగా అమ్మకాలు, కేసులైన తీరు మారని నిర్వాహకులు...**








కబురు న్యూస్, ప్రతినిధి,వీణవంక, సెప్టెంబర్ 30.

వీణవంక మండలంలోని 26 గ్రామాలలో వాడవాడనా బెల్ట్ షాపులతో మద్యం ఏరులై పారుతుంది. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా, ధనార్జన ధ్యేయంగా కిరాణా షాపులలో యాచ్చేదగా మద్యం విక్రయిస్తూ, కుటుంబాలను సర్వ నాశనం చేస్తున్నారు. ఒక వాడలో దాదాపుగా మూడు షాపు నిర్వహిస్తూ, అమాయక జనాలను తాగుబోతులుగా మారుస్తూ, బెల్ట్ దందాతో కుటుంబాలను కులుస్తూ, బెల్ట్ షాప్ యజమానులు ఆర్థికంగా ఎదుగుతూ, ఫ్లాట్స్, భవనాలు కొనుగోలు చేస్తూ, ఆర్థికంగా ఎదుగుతున్నారని, ఇటీవల కాలంలో మండలంలో కొన్ని దాడులు నిర్వహించిన , కేసులు పాలైన తర్వాత కూడా నిర్వాహకులు మళ్లీ బెల్ట్ షాప్ నిర్వాహణ యధావిధిగా జరుగుతుందని, కొన్ని బెల్ట్ షాపులలో ఉదయం లేచిందే మొదలు రాత్రి 12 గంటల వరకు, మద్యం 24 గంటలు విక్రయిస్తూ, యువకులను తాగుడుకు బానిసలుగా మారుస్తున్నారని,కుటుంబాలకు దూరం చేస్తున్నారని, అతిగా మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవ పడడం, విచక్షణ రహితంగా కుటుంబ సభ్యులను కొట్టడం, ఎవరైనా మందలిస్తే ఆత్మహత్యకు పాల్పడడం వంటి సంఘటనలు జరుగుతున్నాయని, బెల్ట్ షాప్ ల వల్ల యువకులు, ఇంటి యజమానులు సైతం సర్వసం కోల్పోయి, నిత్యం మద్యం మత్తులో దుర్భర జీవితం గడుపుతున్నారని, మండలంలో బెల్ట్ షాపులు పెరగడానికి కారణం,ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో కనీసం వైన్ షాప్ నుండి కొనుగోలు చేసిన మద్యం బాటిల్ లకు స్టిక్కర్లు వేయకుండా అమ్మకాలు జరపడంపై, సర్వత్ర చర్చనియా అంశంగా తయారైందని, వీణవంక మండల పరిధిలోని గ్రామాలలో బెల్టు షాపుల జోరుతో సామాన్యుడు సైతం విలవిల్లాడిపోతున్నాడని, కుటుంబ సభ్యులు, మహిళలు,మేధావులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, మండల అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే మేల్కొని, బెల్ట్ షాప్ యజమానులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని, మండల ప్రజలు కోరుతున్నారు.

# హైడ్రా చీఫ్ రంగనాథ్ పై మండిపడ్డ హైకోర్టు..

కబురు న్యూస్, దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.




హైడ్రా పనులు శని, ఆదివారాల్లో పనిచేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్న ఉరితీసే ముందు చివరి కోరిక అడుగుతారని వ్యాఖ్య ఇళ్లను కూల్చేసేముందు బాధితులకు చివరి అవకాశం ఇచ్చారా అని నిలదీసిన కోర్టు హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుందని వార్నింగ్ రాజకీయ నేతలను, పై అధికారులను సంతృప్తి పరిచేందుకు అత్యుత్సాహంతో పనిచేయొద్దని తెలంగాణ హైకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. హైడ్రా కూల్చివేతలకు సంబంధించి ఆ సంస్థ చీఫ్ రంగనాథ్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సెలవు దినాల్లో పనిచేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, శని ఆది వారాల్లో కూల్చివేతలు చేపట్టడమేంటని నిలదీసింది. కరుడుగట్టిన నేరస్థుడిని ఉరితీసే ముందు కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారని గుర్తుచేస్తూ.. ఇంటిని కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా అంటూ ప్రశ్నించింది. ఈమేరకు హైడ్రా కూల్చివేతలపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు సోమవారం ఉదయం విచారణ చేపట్టింది. హైడ్రా చీఫ్ వర్చువల్ గా, అమీన్ పూర్ తహసీల్దార్ కోర్టులో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైడ్రా చీఫ్ రంగనాథ్ కు హైకోర్టు పలు ప్రశ్నలు సంధించింది.

శని, ఆదివారాల్లోనే ఎందుకు ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ ఆదివారం సెలవుదినం.. అలాంటిది సెలవు దినాలలో మీరు ఎందుకు పనిచేస్తున్నారని రంగనాథ్ ను హైకోర్టు ప్రశ్నించింది. శని, ఆదివారాల్లో అదికూడా సూర్యాస్తమయం తర్వాత కూల్చివేతలు ఎందుకు చేపడుతున్నారని నిలదీసింది. గతంలో వారాంతంలో కూల్చివేతలు చేపట్టవద్దంటూ కోర్టులు తీర్పిచ్చిన విషయం తెలియదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టప్రకారం నడుచుకోకపోతే తర్వాత ఇబ్బంది పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. రాజకీయ నేతలు చెప్పారనో, పై అధికారులు ఆదేశించారనో అత్యుత్సాహంతో పనిచేస్తే ఆ తర్వాత ఇబ్బంది పడతారంటూ అధికారులకు వార్నింగ్ ఇచ్చింది.

అడిగిన ప్రశ్నకు మాత్రమే జవాబివ్వండి..

ఆదివారం కూల్చివేతలు చేపట్ట వచ్చా అని హైకోర్టు ప్రశ్నించగా.. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బంది కావాలని కోరడంతో సమకూర్చామని రంగనాథ్ జవాబు చెప్పారు. దీనిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అడిగిన ప్రశ్నకు నేరుగా జవాబివ్వాలని హెచ్చరించింది. చార్మినార్ కూల్చివేతకు తహసీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా అని అడిగింది. ఆక్రమణదారులు ఇల్లు ఖాళీ చేయనంతమాత్రాన కూల్చివేతలు చేపట్టడమేంటని ప్రశ్నించింది. ఆదివారం కూల్చివేతలు చేపట్టడం హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అంటూ మండిపడింది. చట్ట ప్రకారం నడుచుకోకుంటే ఇంటికి వెళతారు జాగ్రత్త.. అంటూ అధికారులను హెచ్చరించింది.

కూల్చివేతలపై మాత్రమే దృష్టి పెట్టారేం?

హైడ్రాకు ఉన్న విధుల్లో ఆక్రమణల తొలగింపు కూడా ఒకటని, కేవలం ఇదొక్కటే హైడ్రా డ్యూటీ కాదని హైకోర్టు పేర్కొంది. జీవో ప్రకారం నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే బాధ్యత కూడా హైడ్రాకు ఉందని, మరి దానిపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదేమని ప్రశ్నించింది. అమీన్ పూర్ కూల్చివేతలతో పాటు మూసీ విషయంలోనూ 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని హైకోర్టు పేర్కొంది. దీంతో ఇది అరుదైన కేసుగా భావించి అధికారులను విచారణకు పిలిచినట్లు తెలిపింది. నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చింది.

చట్టప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తిచేసి, స్థానిక సంస్థల అనుమతి తీసుకున్నాకే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని కోర్టు గుర్తుచేసింది. అయితే, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించింది. హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. కానీ దాని పనితీరుపైనే తమ అభ్యంతరమని కోర్టు పేర్కొంది. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదని, ఎఫ్ టీఎల్ నిర్ధారించకుండా అక్రమాలను ఎలా తేలుస్తారని నిలదీసింది. అనంతరం కేసు విచారణను ఈ అక్టోబర్ 15 కు వాయిదా వేస్తూ అప్పటి వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది.. అదేవిధంగా హైడ్రా ఏర్పాటు అభినందనీయం అని తెలియజేసింది.

# రాష్ట్రంలో ప్రజా పాలన...

**– పేద బడుగు బలహీన అన్ని వర్గాలకు సమతుల్య న్యాయం...**
**– మంత్రులు సీతక్క.. పొన్నం**

కబురు న్యూస్,శంకరపట్నం సెప్టెంబర్ 30



కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజా పాలనను కొనసాగిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దనసరి అనసూయ అలియాస్ సీతక్క అన్నారు సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామంలోని ది కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ , మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి విద్యా శిక్షణా కేంద్రం 35 వ వార్షికోత్సవ వేడుకలు . మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి శాల్వాలతో సన్మానం చేశారు. మంత్రులు మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి విద్యా శిక్షణ కేంద్రం నిర్వహణపై అడిగి తెలుసుకొని పలు సూచనలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి,మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రూ శోభారాణి ,స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకిటి కరుణ ,డైరెక్టర్ క్రాంతి వేస్లి , కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ,అడిషనల్ కలెక్టర్ ప్రఫుల దేశాయ్ వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖాతాదారుల రైతుల శ్రేయస్సు సంఘ లక్ష్యం...

**– చైర్మన్ మధుకర్ రెడ్డి...**

కబురు న్యూస్,:శంకరపట్నం సెప్టెంబర్ 30



ఖాతాదారుల, రైతుల శ్రేయస్సు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లక్ష్యమని సంఘం చైర్మన్ కేతిరి, మధుకర్ రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ మధుకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం సీఈఓ పూలు వీరస్వామి సంఘం ఆదాయ ఖర్చుల వివరాలను సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మధుకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సంఘం ఖాతాదారులకు, రైతులకు సంఘం ఆధ్వర్యంలో రుణాలు అందజేయడం జరిగిందని నాలు పొందిన ఖాతాదారులు రైతులు క్రమం తప్పకుండా రుణ వాయిదాలను చెల్లించి సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని, సంఘం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అందరి సహాయ సహకారాలతో తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహాయ సహకార సంఘం జిల్లాలో మూడో స్థానంలో ఉందని, సంఘ సభ్యులు ఖాతాదారులు రైతులు సహకరిస్తే సంఘాన్ని జిల్లాలోని మొదటి స్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని మధుకర్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నరహరి వెంకటరమరెడ్డి, డైరెక్టర్లు తిరుపతి సమ్మయ్య, దొంగల రామయ్య, కలకుంట్ల సత్యనారాయణ రావు, మాచర్ల పద్మ ,జుల శ్రీనివాస్, తాండ్ర స్వరూప, జూల శ్రీనివాస్, వెంగళ ప్రవీణ్, బాకారపు రవి, సంఘం నోడల్ అధికారి లత, కార్యదర్శి పోలు వీరస్వామి, సిబ్బంది, రైతులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

## ప్రధాని మోడీ అభినందనలు

కబురు సినిమా సెప్టెంబర్ 30..



మన దేశంలో సినీ రంగానికి సంబంధించి ప్రతిష్ఠాత్మకంగా భావించే అవార్డుల్లో 'దాదా సాహెబ్ ఫాల్కే' ప్రధానమైనది. ఈ ఏడాది అవార్డుకు ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి ఎంపికైనట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. అక్టోబర్ 8న జరగనున్న జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కేంద్ర, సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ పోస్ట్ పెట్టారు. మిథున్ చక్రవర్తి అద్భుతమైన సినీ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలు గుర్తించి ఈ ఏడాది దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం ఆయనకు అందించాలని జ్యూరీ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. మిథున్ చక్రవర్తికి శు భాకాంక్షలు తెలిపారు. భారతీయ చలన చిత్ర రంగానికి ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి చేసిన అపారమైన సేవలను గుర్తించి ఆయనకు ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉంది. విభిన్నమైన నటనతో ఆయన ఎన్నో తరాలను అలరించారు. ఎంతోమంది అభిమానాన్ని పొందారు. ఆయనకు నా అభినందనలని ప్రధాని పేర్కొన్నారు. ఈ పురస్కారానికి తాను ఎంపిక కావడంపై మిథున్ ఆనందం వ్యక్తంచేశారు. మాటలు రావడం లేదు. ఇలాంటి గొప్ప విజయాన్ని నేను అస్సలు ఊహించలేదు. చాలా సంతోషంగా ఉన్నా. నా కుటుంబానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు దీనిని అంకితం చేస్తున్నానని తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మిథున్ చక్రవర్తి.. బాలీవుడ్‌లో ఎన్నో చిత్రాల్లో యాక్ట్ చేసి పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. హీరోగానే కాకుండా సహాయనటుడు, విలన్‌గా కూడా ఆయన ఎంతోమంది స్టార్ హీరోల చిత్రాల్లో నటించారు. 1976లో 'మృగాయ'తో నటుడిగా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు. 'ముక్తి', 'బన్సారీ', 'అమర్‌దీప్', 'ప్రేమ్ వివాహ్', 'భయానక్', 'కస్తూరి', 'కిస్మత్', 'మే ఔర్ మేరా సాథి', 'సాహస్', 'వాంటెడ్', 'బాక్సర్', 'త్రినేత్ర', 'దుష్మన్', 'దలాల్', 'భీష్మ', 'సుల్తాన్', 'గురు', 'కిక్', 'బాస్', డిస్కోడాన్సర్ వంటి చిత్రాలు ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. హిందీ, బెంగాలీ చిత్రాలతోపాటు కన్నడ, తెలుగు, ఒరియా, భోజ్‌పురి చిత్రాల్లోనూ ఆయన నటించారు. 'గోపాల గోపాల'తో తెలుగు వారికి సుపరిచితమయ్యారు. ఇందులో ఆయన ప్రతినాయకుడిగా కనిపించారు. అనంతరం 'మలుపు' అనే టాలీవుడ్ మూవీలోనూ ఆయన యాక్ట్ చేశారు. 'ఐ యామే డిస్కో డాన్సర్' అన్న పాటతో దేశవిదేశాల్లో గుర్తింపు తెచ్చుకొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆయనకు పద్మభూషణ్ అవార్డును కేంద్రం అందజేసింది.

## తండేల్‌లో నాగచైతన్య.. సాయిపల్లవి డ్యాన్స్ సాంగ్

కబురు సినిమా సెప్టెంబర్ 30..




నవ యువ సామ్రాట్ నాగచైతన్య, లేడీ పవర్‌స్టార్ సాయి పల్లవి జంటగా నటిస్తోన్న రెండో చిత్రం 'తండేల్' పాన్ ఇండియాగా రూపొందుతున్న ఈ మూవీకి కార్తికేయ2 ఫేం చందూ మొండేటి దర్శకత్వం వహిస్తుండగా అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్2 బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మించారు. శ్రీకాకుళం జిల్లా డి.మచ్చిలేశం గ్రామంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ తండేల్ సినిమాను తెరకెక్కించడం విశేషం. వాస్తవ ఘటనలతో రూపొందిస్తున్న ఈ సినిమాలో ఇద్దరు ప్రేమికుల మధ్య వారి జీవితాల్లో సంభవించిన పరిస్థితులు, భావోద్వేగాలు ఇతర పరిస్థితులను చాలా గ్రిప్పింగ్‌గా, ఆకర్షణీయంగా తెరపై మలుస్తున్నాడు దర్శకుడు చందు మొండేటి. అదేవిధంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాకుళంలోని పురాతన శివాలయం శ్రీముఖలింగం సన్నిధిలో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను ప్రేరణగా తీసుకుని ఈ సినిమా కోసం మునుపెన్నడూ చూడని రీతిలో ఓ ప్రత్యేక శివరాత్రి పాటను ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ క్రమంలో ఇప్పటికే శివరాత్రి ఉత్సవ వైభవాన్ని తెలియజేసేలా భారీ సెట్టింగ్‌లు మరియు అత్యంత వ్యయంతో అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ నృత్య దర్శకత్వంలో ఓ పాటను చిత్రీకరించారు. ఈ పాటలో నాగ చైతన్య, సాయి పల్లవిలతో పాటు వేలాది మంది డ్యాన్సర్‌లతో కలిసి డ్యాన్స్ చేశారు. అయితే ఈ పాట నాగ చైతన్య సాయి పల్లవిల కెరీర్‌లోనే మోస్ట్ స్పెషల్ సాంగ్స్ లో ఒకటిగా ఉండబోతుండగా దసరా పర్వదినం సందర్భంగా త్వరలోనే ఈ సాంగ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర యూనిట్ ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు తాజాగా పాట షూటింగ్ సందర్భంగా తీసిన ఫొటోలను మేకర్స్ విడుదల చేశారు. కాగా ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు. త్వరలోనే అధికారికంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేయనున్నారు.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న కార్తీ

కబురు సినిమా సెప్టెంబర్ 30..



ప్రముఖ తమిళ నటుడు కార్తి విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన నటించిన 'సత్యం సుందరం' చిత్ర ప్రచారంలో భాగంగా కార్తీ విజయవాడ వచ్చారు. చిత్ర బృందంలో కలిసి ఇంద్రకీలాద్రికి వచ్చిన కార్తికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. 2013లో ఓసారి దుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చానని కార్తి చెప్పారు. మళ్లీ ఇప్పుడు కనకదుర్గమ్మ సన్నిధికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. 'సత్యం సుందరం' చిత్రం మంచి ఆదరణ పొందుతోందని సంతోషం వ్యక్తం చేశారు

## జీబ్రా మూవీ టీజర్ విడుదల




కబురు సినిమా సెప్టెంబర్ 30..

యువ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జీబ్రా' లక్ ఫేవర్స్ ది బ్రేవ్.. అన్నది ఉపశీర్షిక. ఈ సినిమాకు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా.. ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని అక్టోబర్ 31న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే యాక్షన్ క్రైమ్ కామెడీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మత్తు వదలరా ఫేం సత్య కూడా టీజర్‌లో మరోసారి నవ్వులు పూయించాడు. ప్రియా భవానీ శంకర్ , జెన్నిఫర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో పుష్ప సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) విలన్ పాత్రలో నటిస్తున్నాడు. సునీల్ సత్యరాజ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## నారాయణమంత్రంపై కీరవాణి ఆడియో

### అభినందించిన డిప్యూటి సిఎం పవన్




కబురు సినిమా సెప్టెంబర్ 30..

ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం. ఎం. కీరవాణికి ధన్యవాదాలు తెలుపుతూ ఏపీ డిప్యూటీ సీఎం,పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓ ప్రకటనను విడుదల చేశారు. తిరుమల మహా ప్రసాదం అయిన లడ్డూ తయారీలో కల్లీ నెయ్యి వినియోగంపై పవన్ కళ్యాణ్ ఈ ఆవేదన నిమిత్తం ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టిన విషయం తెలిసిందే. ప్రాయశ్చిత్త నిమిత్తం అంతా నారాయణ మంత్రం పఠిస్తున్నారు. అలా నారాయణ మంత్రం పఠించే వారందరి కోసం సంగీత దర్శకుడు కీరవాణి ఓ ఆడియో రికార్డ్ చేశారు. ఆడియో రికార్డ్ చేసిన కీరవాణికి, ఆయన టీమ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ.. జనసేన పార్టీ తరపున పవన్ కళ్యాణ్ అధికారికంగా ఓ ప్రకటనను విడుదల చేశారు. అందులో.. 'ఓం నమో నారాయణాయ' మంత్రాన్ని ప్రజానీకం పఠించేందుకు అనువుగా ఆడియో రికార్డు రూపొందించిన ప్రముఖ సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణిగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తిరుమల మహా ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం భక్తి భావం కలిగిన ప్రతి ఒక్కరికీ తీవ్ర ఆవేదన కలిగించింది. ఈ ఆవేదన నుంచే ప్రాయశ్చిత్త దీక్ష ప్రారంభించాను. ఈ దీక్షకు సంఘీభావంగా జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులతో పాటు ధార్మిక విశ్వాసాలు కలిగినవారందరూ ఆలయాల్లో పూజలు, హోమాలు, భజనలు చేస్తున్నారు. వారంతా ఓం నమో నారాయణాయ మంత్రం పఠిస్తున్నారు. అందుకు అనువుగా కీరవాణి ఆడియో రికార్డు చేశారు. భక్తి భావంతో సాగింది. ఇందులో భాగం పంచుకున్న సంగీత కళాకారులకి, సాంకేతిక నిపుణులకి ధన్యవాదాలు. ధర్మో రక్షతి రక్షిత:' అని పేర్కొన్నారు.

## నన్ను చూసి ధనుష్ అసూయపడుతున్నారట

కబురు సినిమా సెప్టెంబర్ 30..

'రాయన్' తో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్నారు నటి దుషారా విజయన్ . ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఆయన సోదరిగా నటించారు. ఆమె నటనతో సినీప్రియుల మనసు గెలుచుకున్నారు. తన తదుపరి చిత్రం 'వేట్టయాన్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ధనుష్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ హీరో అంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టక ముందునుంచే ఆయన్ని అభిమానిస్తున్నానని అన్నారు. అనంతరం ఆమె ధనుష్‌కు రజనీకాంత్ అంటే ఎంతో ఇష్టమో చెప్పారు."రాయన్', 'వేట్టయాన్' సినిమా షూటింగ్స్ ఒకే సమయంలో జరిగాయి. నేను రజనీకాంత్ మూవీ (వేట్టయాన్)లో యాక్ట్ చేస్తున్నానని తెలిసి ధనుష్ ఆనందించారు. ఓసారి నా వద్దకు వచ్చి.. 'రజనీకాంత్ సర్‌తో కలిసి యాక్ట్ చేశావా?' అని అడిగారు. అవునని చెప్పా. ఆయన వెంటనే ఈ విషయంలో నిన్ను చూసి అసూయపడుతున్నా. ఎందుకంటే ఆయనతో నేనింకా స్క్రీన్ షేర్ చేసుకోలేకపోయా అని చెప్పారు. రజనీకాంత్‌ను ఆయన ఎంతలా ఇష్టపడతారో ఆ రోజు నాకు బాగా అర్థమైంది" అని దుషారా విజయన్ వెల్లడించారు. రజనీకాంత్‌పై తనకు ఉన్న అభిమానాన్ని ధనుష్ ఇప్పటికే పలు సందర్భాల్లో తెలియజేశారు. చిన్నతనం నుంచే ఆయన్ని ఆరాధిస్తున్నానని చెప్పారు. ఆయన ఇల్లు చూడటం కోసమే పోయస్ గార్డెన్‌కు వెళ్లేవాడినని ఇటీవల 'రాయన్' ఈవెంట్‌లో తెలియజేశారు.'జై భీమ్' విజయం తర్వాత టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. యాక్షన్ డ్రామా మూవీగా ఇది సిద్ధమైంది. ఇందులో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా కనిపించనున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. అమితాబ్, ఫహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయన్ కీలకపాత్రలు పోషించారు. అనిరుధ్ స్వరాలు అందించారు. అక్టోబర్ 10న ఇది సినీప్రియుల ముందుకురానుంది.



Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com